సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం, 23, సెప్టెంబర్, 2024



ఇసుకకు కటకట

జమ్మలమడుగు నుంచి అనేక ప్రాంతాలకు టిప్పర్ల ద్వారా ఇసుక యథేచ్ఛగా తరలిపోతున్నప్పటికీ.. ఇక్కడి వారికి మాత్రం అందని ద్రాక్షగా మారింది. -8లో



ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

ఉపాధ్యాయ సమస్యలపై ఏపీటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖర్‌రెడ్డి అన్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
34.4 /26.8

వాతావరణం

జిల్లాలో ఆదివారం 26.8 - 34.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేటి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' రద్దు

కడప సెవెన్‌రోడ్స్: సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల్లో సాధించిన విజయాలు, ప్రగతిని జిల్లా ప్రజలకు తెలియచేజేసేందుకు 'ఇది మంచి ప్రభుత్వం', స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ -2047 కార్యక్రమాల్లో భాగంగా జిల్లా అంతటా గ్రామసభలు నిర్వహిస్తున్న సందర్భంగా ఈ నెల 23న జరగాల్సిన ప్రజల నుంచి వినతులను స్వీకరించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కార్యక్రమాన్ని తాత్కాలిక రద్దు చేశామన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన వివరించారు.

గంగమ్మా..కాపాడు తల్లీ..



గంగమ్మ తల్లికి పూజలు చేస్తున్న పూజారులు

లక్కిరెడ్డిపల్లి: వర్షాలు కురిపించి రైతులు, ప్రజలు అందరూ చల్లగా ఉండేలా కాపాడు తల్లీ అంటూ ఆదివారం గంగమ్మ దేవతకు భక్తులు బోనాలు సమర్పించారు. తలనీలాలు అర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలిరావడంతో క్యూలైన్లు నిండిపోయాయి. ఆలయ చైర్మన్ రెడ్డయ్య, ఆలయ ప్రత్యేకాధికారి మారుతీ ప్రసాద్‌లు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. పూజారులు చెల్లు వంశీయులు గంగరాజు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డిలు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణం



మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్: మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ, క్రీడలు, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆదివారం అన్నమయ్య జిల్లా రాయచోటి రూరల్ పరిధిలోని శిబ్యాల గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం'ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి నుంచి అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి మూడు సిలిండర్లు ఉచితంగా అందజేయడానికి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిని రాబోయే ఐదు సంవత్సరాల్లో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. విదేశాలకు జీవనోపాధి కోసం వెళ్లి కష్టాలు ఎదుర్కొంటున్నారని, అలాంటి వారికి ఇక్కడే జీవనోపాధి లభించే విధంగా ఫ్యాక్టరీలు, పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు.

దర్జాగా చోరీ.. ఎంచక్కా పరారీ

- జిల్లాలో మూడు ఏటీఎం మిషన్లపై దుండగుల దాడి
- కడప నగరంలో రెండు ఏటీఎం మిషన్లపై....
- సైరన్ మోగడంతో ఓ చోట యత్నం విఫలం
- ఆధునిక గ్యాస్‌కట్టర్స్, బ్లాక్ స్ప్రేలతో చోరీ



ఒంటిమిట్టలో ఏటీఎంను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజునాయక్



ఏటీఎం సెంటర్‌లో చోరీకి పాల్పడుతున్న సీసీ పుటేజీ దృశ్యాలు (ఇన్‌సెట్) చోరి గురైన ఏటీఎం మిషన్ లోపలిభాగం

కడప అర్బన్: బ్యాంకు ఏటీఎంలే లక్ష్యంగా చోరులు రెచ్చిపోయారు. జిల్లాలో ఒకే రోజు పలు చోట్ల చోరీకి పాల్పడ్డారు. వందలా.. వేలా.. లక్షలాది రూపాయాలు దోచుకుని ఎంచక్కా పరారయ్యారు. వివరాల్లోకి వెళితే కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విశ్వేశ్వరయ్య సర్కిల్ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌కు మొదట దుండగులు కారులో వచ్చారు. అక్కడకు శనివారం (తెల్లారితే ఆదివారం) అర్ధరాత్రి సుమారు 12:40 గంటలకు వచ్చి బ్లాక్ స్ప్రేతో సీసీ కెమెరాలపై స్ప్రే చేశారు. ఆపై మిషన్ అంచులకు ఒకరకమైన జెల్ స్ప్రే చేశారు.గ్యాస్ కట్టర్‌లను ఉపయోగించకముందే ఓపెన్ చేసేందుకు ప్రయత్నించగా.. ఏటీఎం మిషన్ నుంచి పెద్ద శబ్దంతో సైరన్ మోగింది. దీంతో భయపడిన దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. ఆపై తెల్లవారుజామున 2-3 గంటల సమయంలో ద్వారకానగర్‌లో రైతుబజార్ సమీపంలో హాస్పిటల్స్ పక్కనున్న ఎస్‌బీఐ ఏటీఎంను టార్గెట్ చేశారు. అక్కడ ఎవరూ లేరని గుర్తించి తమవెంట తెచ్చుకున్న 'సూట్‌ల'ను ధరించారు. ముఖాలు కూడా కనిపించనీయకుండా ఒళ్లంతా కవర్ చేసుకుని ఏటీఎం సెంటర్‌లోకి ప్రవేశించారు. లోపలికి మిషన్ దగ్గరకు చేరుకున్న వ్యక్తి జెల్‌ను స్ప్రే చేశాడు. సీసీ కెమెరాల నుంచి కనిపించకుండా బ్లాక్ స్ప్రేతో కవర్ చేశారు. రెండవ సారి అలారం మోగకుండా జాగ్రత్తపడిన దుండగులు ఎంచక్కా మిషన్‌ను గ్యాస్ కట్టర్స్ ద్వారా తెరిచి అందులోని రూ. 6,19,300 నగదును అపహరించారు. తరువాత కేవలం 40 నిమిషాల వ్యవధిలోనే రాజంపేట రహదారిలో ప్రయాణించారు. ఒంటిమిట్టకు చేరుకుని అక్కడ తెల్లవారుజామున 3.40 గంటలకు పోలీస్ స్టేషన్ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎం మిషన్‌లోకి ప్రవేశించారు. అక్కడా అదే పద్ధతిలో నగదు చోరీ చేశారు. అందులో దాచి ఉంచిన రూ. 36,11,400లను దోచుకుని వెళ్లారు. రెండు ఏటీఎం మిషన్లనుంచి మొత్తం రూ.42,30,700 నగదును అపహరించారు.



ఏటీఎం మిషన్ల దోపిడీ గ్యాంగ్ కోసం ప్రత్యేక పోలీసు బృందం

వైఎస్ఆర్ జిల్లా కడపలో, ఒంటిమిట్టలో ఎస్‌బీఐ ఏటీఎం మిషన్లలో దోపిడీలకు పాల్పడిన దుండగులను పట్టుకునేందుకు ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు నేతృత్వంలో పోలీసు అధికారుల బృందాలను ఏర్పాటు చేశారు. ఆదివారం తెల్లవారుజామునుంచే వారిపై నిఘా ఉంచి తమ వంతుగా విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.

ఏటీఎంల భద్రతపై సందేహాలు?

ఏటీఎంల నుంచి నగదు చోరీ చేసి తీసుకెళ్లిన ఘటనలు గతంలోనూ ఉన్నాయి. కడప నగర శివార్లలోని చింతకొమ్మదిన్నె మండలం పులివెందుల రోడ్డులో కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని ఎస్‌బిఐ ఏటిఎం మిషన్‌ను హర్యానా రాష్ట్రంకు చెందిన మేవాత్ గ్యాంగ్‌కు చెందిన దుండగులు గ్యాస్‌కట్టర్‌లను ఉపయోగించి రూ. 17 లక్షలను, రాజంపేట రోడ్డులో రిమ్స్ పిఎస్ పరిధిలో రామాంజనేయపురం వద్ద వున్న ఎస్‌బిఐ ఏటిఎం మిషన్‌లో నుంచి 24 లక్షలను మొత్తం రూ. 41 లక్షలను దోచుకుని వెళ్లారు. ఈ రెండు సంఘటనలు కూడా 2021 డిసెంబర్ 6-7 తేదీలలో తెల్లవారుజామున 2నుంచి 3 గంటల మధ్యే చేశారు. దొంగలు చోరీకి పాల్పడిన వెంటనే తాము ఉపయోగించిన స్కార్పియో వాహనాన్ని అప్పటికే తాము పథకం ప్రకారం ఓ లారీలోకి ఎక్కించి పోలీసుల నిఘా నుంచి తప్పించుకుని పరారయ్యారు. తాజా ఘటనలతో ఏటీఎంల భద్రతపై మళ్లీ సందేహాలు తలెత్తాయి.

నిఘా కొరవడిందా?



జిల్లాలో వివిధ కేటగిరీలకు చెందిన 28 రకాల బ్యాంకులు ఉన్నాయి. 372 బ్రాంచ్‌లతో పాటు, దాదాపు 600 వరకు బ్యాంకుల ఏటీఎంలు ఉన్నాయి. ఆయా ఏటీఎం మిషన్ల వద్ద సీసీకెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలి. కొన్ని ప్రధాన శాఖా కార్యాలయాల వద్ద తప్ప బ్యాంక్ ఏటీఎం మిషన్ల వద్ద సెక్యూరిటీ వారు లేకపోవడంతో ఇలాంటి చోరీలకు అవకాశం కలుగుతోంది. కడప నగరంలోని విశ్వేశ్వరయ్య సర్కిల్ వద్ద ఉన్న ఎస్‌బీఐ బ్యాంక్ ఏటీఎం మిషన్‌ను దుండగులు కొల్లగొట్టే సమయంలో సైరన్ మోగింది. ఇక్కడే గనక సెక్యూరిటీ వారు ఉండి ఉంటే వారు అప్రమత్తమై కడప నగరంలోని ఏటీఎం సెంటర్లకు సంబంధించిన నిర్వాహకులనుగానీ, పోలీసు సిబ్బందిని గానీ అలర్ట్ చేసి ఉండేవారు. ఫలితంగా రెండవ ఎస్‌బీఐ ఏటీఎం మిషన్‌లో చోరీ ఘటనకు అవకాశం లేకుండా పోయేది. మరోవైపు సీసీఎస్ పోలీసుల నిఘా కూడా కొరవడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అటవీశాఖ రేంజ్ అధికారుల బదిలీ

కడప అర్బన్: అటవీశాఖలోని జోన్-4 పరిధిలో పనిచేస్తున్న ఫారెస్ట్ రేంజ్ అధికారులను బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్ఆర్ జిల్లాలోని బద్వేల్ ఫారెస్ట్ రేంజ్ అధికారి పి.వి రమణారెడ్డిని కర్నూలు ఫారెస్ట్ సెక్షన్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్ విభాగానికి బదిలీ చేశారు. కడప ఫారెస్ట్ సెక్షన్‌లో పనిచేస్తున్న కె. నయాం అలీని బద్వేల్ రేంజ్ అధికారిగా.. కె.మదన్‌మోహన్ రెడ్డిని అన్నమయ్య జిల్లా మదనపల్లి నుంచి కడప ఫ్లయింగ్ స్క్వాడ్‌కు బదిలీ చేశారు. వి. నరసింహులును శ్రీశైలం ప్రాజెక్ట్ టైగర్ జోన్ పరిధిలో ఆత్మకూరు నుంచి జమ్మలమడుగు ఎస్ఎఫ్ రేంజ్‌కు బదిలీ చేశారు.

రాజంపేటకు ఇద్దరు..

రాజంపేట: రాజంపేట అటవీశాఖకు ఇద్దరు రేంజర్లు నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న రేంజర్ నారాయణ పలమనేరుకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో శివన్న, దత్తాత్రేయ నియమితులయ్యారు. ఈమేరకు ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రేంజర్ శివన్న పలమనేరు నుంచి రాగా, దత్తాత్రేయ భాకరాపేట నుంచి రాజంపేటకు బదిలీ అయ్యారు.

జెడ్పీ సీఈఓ, జిల్లా పంచాయతీ అధికారి బదిలీ

కడప, సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్ సీఈఓ సుధాకర్‌రెడ్డిని పుట్టపర్తి డీఎల్‌డీఓగా బదిలీ చేశారు. అనంతపురంలో డీఎల్‌డీఓగా పనిచేస్తున్న ఓబుళమ్మను కడప జెడ్పీసీఈఓగా నియమించారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ రమణారెడ్డిని బదిలీ చేసినా పోస్టింగ్ ఇవ్వలేదు. ఆయన స్థానంలో డ్వామాలో పనిచేస్తున్న మైథిలీని నియమించారు. జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) ప్రభాకరర్‌రెడ్డిని ఆదోని డీఎల్‌డీఓగా బదిలీ చేశారు. విజయవాడ ఏపీఎస్ఐఆర్డీలో పని చేస్తున్న రాజ్యలక్ష్మిని కడప డీపీఓగా నియమించారు. అన్నమయ్య జిల్లా పంచాయతీ అధికారిగా బాలకృష్ణారెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎన్‌సీసీ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

తిరుపతి గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దహియా



ఎన్‌సీసీ కేడెట్స్‌తో మాట్లాడుతున్న తిరుపతి గ్రూప్ కమాండర్

వైవీయూ: ఎన్‌సీసీ శిక్షణను కేడెట్స్ సద్వినియోగం చేసుకుని రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక కావాలని 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సతీందర్ దహియా సూచించారు. కడప నగరం తెలుగుగంగకాలనీలో నిర్వహిస్తున్న 7వ కంబైన్డ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంపును తిరుపతి గ్రూప్ కమాండర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమాండర్ మాట్లాడుతూ కడప ఎన్‌సీసీ బెటాలియన్‌లో శిక్షణ, ఫైరింగ్ రేంజ్, ఇతర సౌకర్యాలు చక్కగా ఉన్నాయన్నారు. రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనేందుకు ఎన్‌సీసీ కేడెట్స్‌కు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్యాంపులో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ, డ్రిల్, ఫైరింగ్ తదితర అంశాలను పరిశీలించారు. అంతకు ముందుకు ఎన్‌సీసీ కేడెట్స్ గ్రూప్ కమాండర్‌కు గార్డ్ ఆఫ్ హానర్ చేశారు. 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్. సూర్యనారాయణమూర్తి, క్యాంపు కమాండెంట్ కిషన్‌దత్, ఏఎన్‌ఓలు, పీఐ స్టాఫ్, ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సు



మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 6.30 గంటలకు బయలుదేరి నేరుగా కొండకు చేరుకుంటుందన్నారు. సాయంత్రం వరకు రాగిమానుసర్కిల్ నుంచి మల్లయ్యకొండకు షటిల్ సర్వీసు తిరుగుతుందన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలని కోరారు.

జిల్లా అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం

- కలెక్టర్ శివశంకర్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేస్తున్నట్లు కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. విజన్ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ప్రజల నుంచి క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా సూచనలు, సలహాలు స్వీకరిస్తామన్నారు. నవంబరు 1వ తేది విజన్ పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరిస్తుందన్నారు. రానున్న ఐదేళ్లలో జిల్లాను అభివృద్ధి చేసేందుకు వీలుగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

అభిప్రాయ సేకరణ: క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేయవచ్చన్నారు. స్మార్ట్ ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలన్నారు. పేరు, మొబైల్ నెంబరు నమోదు చేశాక ఓటీపీ వస్తుందన్నారు. ఓటీపీ నమోదు చేయాలన్నారు. జిల్లా, వయస్సు, లింగం, వృత్తి, ఈ-మెయిల్ చిరునామా నమోదు చేయాలన్నారు. తర్వాత కొన్ని ప్రశ్నలను ఎంపిక చేసుకోవాలన్నారు. 11వ ప్రశ్నలో సూచనలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అక్రమంగా తవ్వకాలు



రాళ్లను తొలగిస్తున్న హిటాచి

- శిల్పాలరాయి యథేచ్ఛగా ఇతరప్రాంతాలకు తరలింపు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



తరలించడానికి సిద్ధంగా ఉన్న రాళ్లు

మైలవరం: అధికార పార్టీ నాయకులకు శిల్పాల రాయి కాసులు కురిపిస్తోంది. ఎలాంటి అనుమతులు లేకున్నా అధికార పార్టీ అనే ధీమాతో అడ్డగోలుగా ఇతర ప్రాంతాలకు రాయిని తరలిస్తూ లక్షల రూపాయలు గడిస్తున్నారు. యథేచ్ఛగా రాయిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. మైలవరం మండలం తలమంచిపట్నం పంచాయతీ పరిధిలోని రంగనాయకస్వామి ఆలయ సమీపంలో సోలార్ ప్యానల్ పక్కనే ఈ దందా దర్జాగా సాగుతోంది. ప్రస్తుతం ఇక్కడ ఎలాంటి మైనింగ్ అనుమతులు లేకున్నా అధికార బలంతో స్థానిక నాయకులు అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారు. గతంలో ఇలాగే మైనింగ్ జరుగుతుండటంతో సంబంధింత సోలార్ కంపెనీ ప్రతినిధులు 2019లో తమ సోలార్ ప్యానళ్లకు నష్టం జరుగుతుందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మైన్స్ అండ్ జువాలజీ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు కూడా చేశారు. దీంతో అప్పటి కలెక్టర్, జమ్మలమడుగు ఆర్డీఓ, మండల అధికారి కలసి క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. మైనింగ్ వల్ల దుమ్ము, ధూళి, రాళ్లు పడటంతో కంపెనీకి నష్టం వాటిల్లుతుందని, మైనింగ్ జరుగకుండా నివేదికలు అందజేశారు. ఆ మేరకు మైనింగ్‌శాఖ వారు లీజ్‌లు రద్దు చేశారు. అయితే మళ్లీ ఇప్పుడు వాటిని పక్కన పెట్టి అక్రమ మైనింగ్‌కు పాల్పడుతూ కాసులు దండుకుంటున్నారు.

అధికారులకు ముడుపులు!

ప్రస్తుతం శిల్పాల రాయికి మార్కెట్‌లో డిమాండ్ ఉంది. ఒక అడుగు రూ. 400 నుంచి రూ. 800 వరకు పలుకుతుంది. దీంతో ఒక లారీ రాయిని తీసుకెళితే సుమారు రూ. 5 లక్షల నుంచి 8 లక్షల రూపాయల వరకు ఆదాయం వస్తుంది. దీంతో అధికారుల మద్దతు ఉంటే ఎలాంటి ఆటంకాలు ఉండవని భావించి ముడుపులు అందజేస్తున్నారు. దీంతో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు.

ఫోన్ రావడంతో..

ఆదివారం అక్రమ మైనింగ్ పాల్పడుతున్నారన్న విషయం తెలుసుకుని ఎస్ఐ.. ఇద్దరు కానిస్టేబుళ్లను మైనింగ్ జరుగుతున్న ప్రాంతానికి పంపించారు. మైనింగ్ జరుగుతున్నది వాస్తవమే అని కానిస్టేబుళ్లు ఎస్ఐకి తెలియజేశారు. వెంటనే మైనింగ్ ఆపి యంత్రాలను తీసుకు రమ్మని ఆదేశించారు. దీంతో యంత్రాలను రోడ్డు పైకి తీసుకొచ్చారు. అంతలోనే అధికార పార్టీ నాయకుడు ఫోన్ చేశారని చెప్పడంతో పోలీస్ సిబ్బంది అక్కడి నుంచి తిరిగి వెళ్లిపోయారు.

సంపదను దోచుకుంటున్నారు



గ్రామంలోని సంపదను అధికార పార్టీ నాయకులు యథేచ్ఛగా దోచుకుంటున్నారు. గ్రామంలో రెండు వర్గాలు ఏర్పాటు చేసి.. అదే విధంగా మండలంలో మరో వర్గాన్ని తయారు చేసి ఒకరు మార్చి ఒకరు సంపదను కొల్లగొడుతున్నారు. లక్షలాది రూపాయలు విలువ చేసే సంపద తరలిపోతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకోకపోతే ప్రభుత్వానికి భారీగా నష్టం వాటిల్లుతుంది.

- వినయ్‌కుమార్‌రెడ్డి, తలమంచిపట్నం గ్రామం

పర్యాటకాభివృద్ధికి కొత్త మార్గం

- ఆయా ప్రాంతాల్లో ఇక బాలల సందడి
- పిల్లల్లో అభిరుచి పెంచేందుకు కలెక్టర్ కృషి
- మానసిక వికాసం, పర్యాటకాభివృద్ధికి అవకాశం



కడప కల్చరల్: జిల్లాలో పర్యాటకరంగం అభివృద్ధికి కొత్త మార్గాలు తెరుచుకుంటున్నాయి. కేవలం ప్రచారంతోనే సరిపెట్టకుండా కొత్త పద్ధతుల ద్వారా అభివృద్ధి సాధ్యమని భావించిన కలెక్టర్ ఆ దిశగా బాటలు వేస్తున్నారు. రానున్న బాలల దినోత్సవం నాడు కార్యచరణకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ బృహత్ కార్యక్రమానికి పాఠశాల స్థాయి బాలలే ప్రధాన వనరు కావడం విశేషం. వివరాలిలా ఉన్నాయి.

- జిల్లాలో పర్యాటకంగా అలరించేందుకు పలు ప్రాంతాలు ఉన్నాయి. కానీ, పర్యాటకుల సందడి మాత్రం తక్కువే. ఆ మధ్య కడపోత్సవాలు, ద్విశతాబ్ది ఉత్సవాలు, శ్రీకృష్ణ దేవరాయల పట్టాభిషేక ఉత్సవాల నిర్వహణతో జిల్లా వాసుల్లో ఇలాంటి కార్యక్రమాల పట్ల ఉత్సాహం పెరిగింది. ఆయా ప్రాంతాల్లో పర్యాటకుల సందడి పెరిగినా ఎప్పటికప్పుడు ప్రచారం చేస్తుంటేగానీ కొనసాగడం లేదు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఈ లోటును పూడ్చేందుకు బాలల ద్వారా సరికొత్త కార్యచరణకు శ్రీకారం చుట్టనున్నారు. హైస్కూలు స్థాయి పిల్లల్లో పర్యాటక స్పృహ, అభిరుచి పెంచడంతో ఆ రంగానికి దీర్ఘకాలం భవిష్యత్తు ఉంటుందని వారి భావన.

పిల్లల్లో హాయ్..హాయ్...

జిల్లాలోని అన్ని పాఠశాలలు ఆయా నియోజకవర్గంలో తమ సమీపంలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించడం ఈ పథకంలోని ప్రధాన కార్యక్రమం. విద్యాశాఖ ఇందుకు తగిన ఏర్పాట్లు చేయనుంది. ఆర్టీసీ ఆధ్వర్యంలో రవాణా వసతి సౌకర్యం ఉంటుంది. ఇదంతా అతి తక్కువ ధరలోనే ఏర్పాటు చేసేందుకు కృషి జరుగుతోంది. ఉదయం 7 గంటలకు పాఠశాలల నుంచి బయలుదేరి సాయంత్రం 5-6 గంటల్లోపుగా తిరిగి రావడం ప్రణాళికలో భాగం. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను కూడా ఇందులో భాగస్వాములను చేయనున్నారు. పిల్లలు కనీసం తమ ప్రాంతాల్లోని పర్యాటక ప్రాంతాలనైనా సందర్శించగలరని, ఆరోజంతా ప్రకృతిలో మమేకమై 'హాయ్.. హాయ్..'అంటూ ఆహ్లాదంగా గడిపే అవకాశం ఉంది. ప్రతి నియోజకవర్గం నుంచి పాఠశాల సమీపంలోని పర్యాటక ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని విద్యాశాఖ అధికారుల సహకారంతో ముందే తగిన ఏర్పాట్లు చేసుకునేందుకు ప్రణాళికబద్ధంగా సాగనున్నారు. ప్రైవేటు పాఠశాలలు కూడా ఈ పర్యటనలో భాగస్వాములు కావచ్చు. కేవలం బాలల దినోత్సవానికే పరిమితం కాకుండా నవంబరు మాసమంతా కొనసాగించే అవకాశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. పాఠశాల పిల్లల్లో పర్యాటక అభిరుచి నెలకొంటే వారితోపాటు వారి తల్లిదండ్రుల ద్వారా కూడా మరో 30-50 సంవత్సరాలపాటు ఆ ప్రాంతాల పట్ల ప్రచారం సాగుతుందన్నది అధికారుల అభిప్రాయం.

ఫలించిన ప్రయత్నం

గ్రాండ్ క్యానియన్ ఆఫ్ ఇండియాగా గండికోటకు గొప్ప పేరున్నా అభివృద్ధి అంతంతమాత్రంగా ఉన్న విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లింది. ఈలోపాన్ని అధిగమించేందుకు ఆయన అధికారులతో చర్చించి సెప్టెంబరు 27న జరగనున్న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని గండికోటలో నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించారు. కోటలో టిక్కెట్ పద్ధతిని ఏర్పాటు చేసి ఎనిమిది రకాల ముఖ్య వసతులను ఆరోజున పర్యాటకులకు అందుబాటులోకి తేనున్నారు. ఆర్థికంగా స్వయం అభివృద్ధి సాధించగలిగినపుడే అంచెలంచెలుగానైనా శాశ్వత అభివృద్ధి సాధ్యమని నిర్ణయించారు. ఇదే ఒరవడిలో పిల్లల్లో కూడా పర్యాటక స్పృహ, అభిరుచి పెంచే యత్నాలకు నవంబరు 14న బాలల దినోత్సవం నాడు శ్రీకారం చుట్టనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

క్లుప్తంగా

ఘర్షణ కేసులో నలుగురు అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సాయిపేటలో కుటుంబ సభ్యుల మధ్య జరిగిన ఘర్షణలో యూనస్, అతని భార్య ఫిర్యాదు మేరకు నమోదు చేసిన కేసులో నలుగురిని ఆదివారం అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో అస్లాం, ముక్తియార్, 36వ డివిజన్ కార్పొరేటర్ రఫీ, జావేద్‌లు ఉన్నారు. వీరిని మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా రిమాండ్‌కు తరలించారు.

గంజాయి విక్రేత అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఆర్టీపీపీ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న షేక్ జాఫర్‌ను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెన్నానగర్‌కు చెందిన జాఫర్ గంజాయి తాగడంతో పాటు కమలాపురం నుంచి గంజాయిని తెప్పించుకొని ప్రొద్దుటూరులోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో అతను గంజాయి విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో వన్‌టౌన్ సీఐ రామకృష్ణారెడ్డి సిబ్బందితో కలసి ఆదివారం దాడులు నిర్వహించాడు. దాడిలో జాఫర్‌ను అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 1100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

చెట్టును ఢీకొన్న ట్రాక్టర్



మృతి చెందిన సురేంద్ర

కాశినాయన : మండలంలోని నరసన్నపల్లె గ్రామానికి చెందిన బుసకానిసురేంద్ర (24) అనే యువకుడు ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందాడు. మృతుని బంధువులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సురేంద్ర ట్రాక్టర్‌తో వ్యవసాయం చేసి ఇంటికి వస్తున్న సమయంలో అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ హనుమంతు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోరుమామిళ్ళ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెద్దతిప్పసముద్రం : కర్ణాటక రాష్ట్రం నుంచి ఆంధ్రాకు అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని కారుతో సహా పోలీసులు పట్టుకున్నారు. ఏఎస్ఐ గోపాల్ నాయక్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు పోలీసులు మండలంలోని కందుకూరు సమీపంలోని జింకలమిట్ట వద్ద కాపు కాశారు. ఈ నేపథ్యంలో ములకలచెరువు మండలం సోంపల్లి పంచాయతీ అడవి నాయినిచెరువు గ్రామానికి చెందిన మహేష్ (33) అనే వ్యక్తి కర్ణాటక రాష్ట్రం చేలూరు నుంచి కారులో వస్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. కారులో రూ.1.53 లక్షల విలువ చేసే 40 బాక్సుల కర్ణాటక మద్యం ఉన్నట్లు గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు. కారుతో సహా మద్యంను పట్టుకున్న పోలీసులను ఇన్‌చార్జి ఎస్ఐ గాయత్రి అభినందించారు.

ఇసుకకు కటకట

- రెండు వారాలుగా సామాన్యునికి దొరకని వైనం
- పల్లెల్లో ఆగిన ఇళ్ల నిర్మాణాలు
- పెన్నాకు నీరు వదలడంతో మరింత క్లిష్టతరం



ఇసుక దొరకక పోవడంతో ఆగిన ఇంటి నిర్మాణం

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు నుంచి అనేక ప్రాంతాలకు టిప్పర్ల ద్వారా ఇసుక యథేచ్ఛగా తరలిపోతున్నప్పటికీ.. ఇక్కడి వారికి మాత్రం అందని ద్రాక్షగా మారింది. ప్రభుత్వం కొత్తగా ఉచిత ఇసుక పాలసీ అమలులోకి తెచ్చినా.. జమ్మలమడుగుకు అధికారికంగా ఇసుక రీచ్ లేకపోవడంతో స్థానికులకు ప్రయోజనం శూన్యం. ఇసుక రీచ్ ఉన్న కొండాపురం నుంచి మైలవరం, పెద్దముడియం మండలాల నుంచి తెచ్చుకోవాలంటే బాడుగలు తడిసి మోపెడు అవుతున్నాయి. దీంతో ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టిన సామాన్యుల పరిస్థితి అగోమ్యగోచరంగా మారింది.

దళారులను ఆశ్రయిస్తున్న వైనం

అక్కడక్కడా స్టాక్ పాయింట్లు ఉన్నప్పటికీ.. అక్కడా ఇసుక నిల్వలు లేవు. దీంతో దళారులు రంగ ప్రవేశం చేశారు. వారికి తెలిసిన పద్ధతుల్లో తెచ్చి విక్రయిస్తున్నారు. పోలీసులు కేసులు రాస్తున్నారన్న సాకుతో.. వారు డబుల్ రేటుకు అమ్ముతున్నారు. రెండు వారాలుగా మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీరు వదలడంతో.. పరిస్థితి మరింత క్లిష్టతరంగా మారింది. అలా అని బొత్తిగా ఇసుక రవాణా జరగలేదు అంటే తప్పులో కాలు వేసినట్లే. ఇక్కడి నుంచి కర్నూలు జిల్లాలోని అనేక ప్రాంతాలకు టిప్పర్ల ద్వారా యథేచ్ఛగా అక్రమ రవాణా సాగుతోంది.

బేల్దారులకూ దొరకని పనులు

సాధారణంగా పల్లెల్లో బేల్దార్లకు గిరాకీ ఎక్కువ. అయితే మూడు నెలల నుంచి వారికి కూడా పనులు దొరకడం లేదు. సామాన్యుడికి ఇసుక లభించకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ఎన్నికలకు ముందు 20 కిలోమీటర్ల దూరంలోని పల్లెలకు ట్రాక్టర్ ఇసుకను రూ.4 వేలకు విక్రయించే వారు. ఎన్నికల ఫలితాల తరువాత ఆ రేటు కాస్త రూ.6 వేలకు పెరిగింది. గత నెల రోజులుగా అదే ఇసుక రూ.7 వేలు రూ.8 వేలు కూడా పలికింది. పది రోజులుగా రూ.10 వేలు చెల్లిస్తామన్నా ట్రాక్టర్ ఇసుకను పల్లెలకు చేర్చడానికి దళారులు ముందుకు రావడం లేదు.

ఇసుక లభించడం లేదు



నాలుగు నెలల క్రితం రూ.4 వేలకే ట్రాక్టర్ ఇసుకను వ్యాపారులు ఇంటి వద్దకు తీసుకువచ్చే వారు. ఇప్పుడు ట్రాక్టర్‌కు రూ.8 వేలు చెల్లిస్తామన్నా పల్లెలకు చేర్చడానికి ట్రాక్టర్ యజమానులు ఒప్పుకోవడం లేదు. ఇసుక లభించకపోవడంతో నా లాంటి ఎందరో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు.

– బాబు, వద్దిరాల, మైలవరం మండలం

పనులు దొరకడం లేదు



పల్లెల్లో ఇసుక అందుబాటులో లేకపోవడంతో సామాన్యులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం లేదు. దీంతో బేల్దారులకు పనులు దొరకడం లేదు. గత కొద్ది రోజులుగా నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల, సంజామల మండలాల పల్లెలకు వెళ్తున్నాం. జమ్మలమడుగు ప్రాంతంలోని మైలవరం, పెద్దముడియం మండలాలకు ఇసుక రవాణాను సులభతరం చేయాలని కోరుతున్నాం.

–బాలకృష్ణ, బేల్దారి, మైలవరం మండలం

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన సాయి



గాయపడిన సురేంద్ర



గాయపడిన మాలిక్‌బాషా

దువ్వూరు : వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలయ్యాయి. దువ్వూరు మండలంలో క్రీస్తురాజాపురం వద్ద ఉన్న కడప–కర్నూలు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. చెన్నూరు మండలం బ్రాహ్మణపల్లెకు చెందిన సాయి (38) అనే వ్యక్తి దువ్వూరు మీదుగా ప్రొద్దుటూరుకు వెళుతుండగా, ప్రొద్దుటూరు మండలం గోపవరం గ్రామానికి చెందిన సురేంద్ర (30) అనే వ్యక్తి దువ్వూరు మీదుగా మైదుకూరుకు వెళుతున్నారు. హైవే నుంచి క్రీస్తు రాజాపురం క్రాస్ వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సాయి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లగా, సురేంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వినోద్‌కుమార్ సంఘటన స్థలానికి వెళ్లి క్షతగాత్రులను తన జీపులోనే ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

పోరుమామిళ్ల : పట్టణ శివారులోని మల్లకతువ వద్ద బైక్‌పై వెళుతున్న యువకున్ని లారీ ఢీ కొట్టిన ఘటన ఆదివారం ఉదయం జరిగింది. పోరుమామిళ్లకు చెందిన మాలిక్‌బాష(35) బైక్‌పై వెళుతుండగా పోరుమామిళ్లకు వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మాలిక్‌బాషా తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని వెంటనే 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స చేసి కడప రిమ్స్‌కు తరలించారు.

ఢీకొన్న ద్విచక్ర వాహనాలు

అట్లూరు : మండల పరిధిలోని కడప–బద్వేలు ప్రధాన రహదారిపై శనివారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురు వ్యక్తులకు గాయాలు కాగా వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల వివరాల మేరకు.. నల్లగొండుగారిపల్లి కాలనీకి చెందిన కొండయ్య తన స్కూటీలో వెలుతుండగా రెడ్డిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన శిగే కేశవ అదే స్కూటీలో ఎక్కాడు. అయితే కొద్ది సేపటికే అట్లూరు క్రాస్‌రోడ్డుకు చెందిన ఎర్రగుండ్ల మధు తన ద్విచక్రవానంతో వెళ్తూ.. వెనుకవైపు నుంచి ఢీకొట్టడంతో ముగ్గురు గాయాలపాలయ్యారు. వెంటనే 108 వాహనం ద్వారా కడప రిమ్స్‌కు తరలించగా శిగే కేశవ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ రామకృష్ణయ్య విచారణ చేపట్టారు.

ప్రభుత్వ జాగా.. వేసెయ్ పాగా

- ప్రధాన రోడ్డుకు ఇరువైపులా అక్రమ కట్టడాలు
- ప్రయాణికులు, స్థానికులకు ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



చాపాడు కూడలిలో చేపడుతున్న అక్రమ నిర్మాణం



టీకొట్టులాగా నిర్మిస్తున్న కట్టడం

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులో ప్రభుత్వ జాగా కనిపిస్తే.. పాగా వేసేస్తున్నారు. ప్రధానంగా ప్రొద్దుటూరు – మైదుకూరు జాతీయ రహదారికి ఇరువైపులా అక్రమ కట్టడాలు చేపడుతున్నారు. ఇప్పటికే వివిధ రకాల దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇది చాలదన్నట్లుగా వీటి ముందుకు సాగుతూ.. మరింత స్థలం ఆక్రమిస్తూ నిర్మాణాలు చేపడుతున్నారు. వీటికి అదనంగా తోపుడు బండ్లు పెడుతున్నారు. దీంతో రోడ్డుకు రెండు వైపులా ఉండే బస్టాప్‌ల స్థలం కుచించుకుపోతోంది. దీంతో బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు నిలుచోడానికి కూడా స్థలం లేక ఇబ్బంది పడుతున్నారు. 2009లో నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. ఈ క్రమంలో బస్టాప్‌లను నిర్మించేందుకు స్థలం కూడా కేటాయించారు. రోడ్డు నిర్మాణ పనుల అనంతరం సదరు కాంట్రాక్ట్ సంస్థ అనివార్య కారణాలతో పనులు ఆపడంతో బస్టాప్‌ల నిర్మాణాలు జరగలేదు. దీంతో నాలుగు రోడ్ల కూడలిలో బస్సు నిలుపుతుండగా ప్రయాణికులు ఎక్కేస్తుంటారు. వారికి ఈ పరిస్థితి అసౌకర్యంగా ఉంది. అలాగే నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుండటంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో పల్లవోలుకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా, అక్రమణ నిర్మాణాలు జరుగుతున్నా రెవెన్యూ, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, చాపాడులో బస్టాప్‌లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే ఈ అక్రమ కట్టడంపై వీఆర్‌ఓకు ఫిర్యాదు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి ధనుంజయ్‌బాబు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతర పోరాటం



సమావేశం నిర్వహిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

వైవీయూ : ఉపాధ్యాయ సమస్యలపై ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖర్‌రెడ్డి అన్నారు. ఏపీటీఎఫ్ ఆవిర్భవించి 80 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో కడప పాత బస్టాండ్ సమీపంలోని ఎన్జీవో హోంలో ఆదివారం జిల్లా విద్యా వైజ్ఞానిక మహాసభ జిల్లా అధ్యక్షులు బత్తలరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కులశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఉపాధ్యాయులు స్వేచ్ఛగా బోధన చేసే పరిస్థితులు లేవన్నారు. బోధనకు ఆటంకంగా ఉన్న అనవసరమైన యాప్‌లను తొలగించాలని, మీడియం, సిలబస్ తరగతుల విలీనంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీటీఎఫ్ చరిత్ర, నాయకత్వ పటిమను వివరించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన కడప జిల్లా ఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, రవికుమార్ మాట్లాడుతూ ఏపీటీఎఫ్ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, సమాజ శ్రేయస్సు కోసం పాటుపడడం గర్వించదగ్గ విషయమని అన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యులు సాంబశివారెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులకు అవసరమైనటువంటి కాంపోజిట్ స్కూల్ గ్రాంట్‌లను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కడప జిల్లా డీసీఈబీ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు రాజులు, జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి వీరాంజులరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి అబ్దుల్లా, జిల్లా అసోసియేటివ్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, నాగభూషణం, చంద్రశేఖర్‌రెడ్డి, కాసింవలి, జిల్లా కార్యదర్శులు చెన్నారెడ్డి, రమేష్‌బాబు, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రాజమోహన్‌రెడ్డి, నారాయణస్వామి, ఏపీటీఎఫ్ నాయకులు నారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, షరీఫ్, నాగరాజు, రామిరెడ్డి, దస్తగిరి, పోతులూరయ్య, విజయ్ కుమార్, సుబ్బారెడ్డి, రాజమోహన్ రెడ్డి, మహిళా ఉపాధ్యాయులు చంద్రకళ, తిరుపతమ్మ, కెజియ, సుకుమారి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో టీడీపీ కార్యకర్తల హల్‌చల్

వేంపల్లి : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో శనివారం మధ్యాహ్నం టీడీపీ కార్యకర్తలు హల్‌చల్ చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ కార్యకర్తలు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. అనుమతి లేకుండా క్యాంపస్‌లోకి పది మంది చొరబడి బెదిరింపులకు పాల్పడ్డారు. ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో విద్యార్థులు, అధ్యాపకులు దాదాపు 9,000 మంది ఉన్నారు. విద్యార్థుల అవసరాల కోసం అధికారులు మూడు క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు వీటిని వైఎస్సార్ సీపీకి చెందిన వారు నడుపుతున్నారు. అయితే ట్రిపుల్ ఐటీ అధికారులు అక్టోబర్ 12వ తేదీ లోపల క్యాంటీన్లను ఖాళీ చేయాలని నోటీసులు పంపారు. కొత్త క్యాంటీన్లకు టెండర్లు వేసిన తర్వాతనే ప్రస్తుతం ఉన్న వాటిని రద్దు చేయాలి.. అలా కాకుండా వచ్చే నెలలో ఖాళీ చేయాలని నోటీసులు పంపడం చాలా బాధాకరంగా ఉందని క్యాంటీన్ యజమానులు వాపోతున్నారు. అంతలోపే టీడీపీ కార్యకర్తలు క్యాంటీన్ వద్దకు వచ్చి మా ప్రభుత్వం వచ్చింది.. మీరు ఖాళీ చేయాలని బెదిరింపులకు దిగడం దారుణం అన్నారు. అంతేకాకుండా విద్యార్థులకు భోజన వసతి కార్యక్రమంలో భాగంగా మెస్ యజమానులకు నూజివీడు క్యాంపస్‌లో సమావేశం ఉంటుందని అధికారులు మెసేజ్ ఇవ్వడం జరిగింది. ఈ విషయంపై ట్రిపుల్ ఐటీ అధికారులను వివరణ అడగగా వచ్చే నెలలో క్యాంటీన్లకు సంబంధించి టెండర్లు పిలుస్తామని అక్టోబర్ 12వ తేదీ లోగా క్యాంటీన్ల యజమానులకు నోటీసులు పంపామని తెలిపారు.

ఖాళీ ఉర్దూ టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉర్దూ టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని రూటా రాష్ట్ర కోఆర్డినేటర్ మహమ్మద్ ఆయూబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని రూటా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఉర్దూ ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024లో ప్రభుత్వం ఉర్దూ డీఎస్సీని నిర్వహించి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ భర్తీ చేయడం ద్వారా ఉర్దూ విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. రూటా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మహమ్మద్‌అలీ మాట్లాడుతూ రోష్ని పథకంను రాష్ట్రంలో పునఃప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా సర్వేను నిర్వహించి నూతనంగా 500 ఉర్దూ పోస్టులను ఏర్పాటు చేయాలంటూ కోరారు. రూటా రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి అసదుల్లాబాషా మాట్లాడుతూ రాష్ట్రంలో 55 వేల అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటిలో ఒక్కటి కూడా ఉర్దూ అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో ఉర్దూ విద్యా వ్యవస్థ మనుగడకే ప్రమాదకరంగా మారిందన్నారు. వెంటనే రాష్ట్రంలో 5 వేల ఉర్దూ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు ఉర్దూ విద్యను అందుబాటులోకి తేవడంతో పాటు ఉర్దూ నిరుద్యోగ మైనార్టీ యువతులకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లుగా ఉపాధి కల్పించాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రూటా రాష్ట్ర నేతలు మహమ్మద్ హాషీం, జాఫరుద్దీన్, జిల్లా నేతలు హుమయుద్దీన్, ఇంరోజ్‌అలీఖాన్ పాల్గొన్నారు.

మార్గంమధ్యలో ఆగిన అంబులెన్స్

కలికిరి : సాంకేతిక లోపంతో 108 అంబులెన్స్ మార్గంమధ్యలో ఆగిపోయిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మదనపల్లికి చెందిన 108 అంబులెన్స్ వాహనం శనివారం అర్ధరాత్రి ఓ మహిళను ప్రవసం కోసం తిరుపతికి తీసుకెళ్లింది. తిరుగు ప్రయాణంలో తిరుపతి నుంచి మదనపల్లికి వస్తుండగా.. ఉదయం 4 గంటల సమయంలో కలికిరి సమీపంలోని టి.మాదిగపల్లి వద్ద వెనుకటైరు యాక్సెల్ విరిగిపోవడంతో ఆగిపోయింది. దీంతో 108 సిబ్బంది ఉదయం వరకూ అక్కడే వేచి ఉండి.. కలికిరి 108 వాహనం సాయంతో మదనపల్లికి వెళ్లి సంబంధిత వాహన మెకానిక్‌ను తీసుకువచ్చి మధ్యాహ్నం మరమ్మతులు చేయించారు. మెయింటినెన్స్‌పై దృష్టి సారిస్తే ఇలాంటి ఇబ్బందులు తలెత్తవని చూసిన వాహనదారులు అన్నారు.

అమ్మా.. నేనూ నీ వెంటే..

తల్లి మరణం తట్టుకోలేక కూతురు మృతి



మృతి చెందిన మేరమ్మ

పోరుమామిళ్ల : నవమాసాలు మోసి, కని పెంచిన తల్లి మరణాన్ని కూతురు తట్టుకోలేక పోయింది. 'అమ్మా నీవు లేని ఈ లోకంలో నేను ఉండలేను' అంటూ ఆమె మృత్యువాత పడింది. ఈ సంఘటన ఆదివారం పోరుమామిళ్లలో జరిగింది. గిరినగర్‌కు చెందిన కందుల నీలమ్మ నాలుగు రోజుల క్రితం మరణించింది. అప్పటి నుంచి అమ్మ మరణాన్ని తలుచుకొని కుమిలి పోతున్న కూతురు మేరమ్మ ఆదివారం గుండెపోటుతో కుప్పకూలిందని బంధువులు తెలిపారు. నాలుగు రోజుల్లో తల్లీకూతుర్లు మృతి చెందడంతో గిరినగర్‌లో విషాదం నెలకొంది.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఆర్వోబీ రక్షణగోడను ఢీకొన్న కారు



ఆర్వోబీ రక్షణగోడను ఢీకొన్న కారు



ఆర్వోబీ ఫుట్‌పాత్‌పై ఆగిన కారు

రాజంపేట : రాజంపేట–రాయచోటి రహదారిలోని ఆర్వోబీ(రోడ్ ఓవర్ బ్రిడ్జి)పై ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. రాయచోటికి వెళుతున్న కారు, ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి.. ఆర్వోబీ ఫుట్‌పాత్ రక్షణగోడను ఢీకొని ఆగింది. దీంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. కొంత ముందుకు వెళ్లి ఉంటే ఆర్వోబీ నుంచి కింద పడే పరిస్థితి ఉండేదని స్థానికులు పేర్కొన్నారు. రక్షణగోడ దెబ్బతింది. కాగా ఈ ప్రమాదం చోటుచేసుకునే క్రమంలో ఆర్వోబీ కింద జనసంచారం లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. లేనిపక్షంలో పెచ్చులు వారి మీద పడేవి. రక్షణగోడను ఢీకొన్న కారు అలాగే ఫుట్‌పాత్‌పై నిలిచిపోయింది. ఆర్వోబీపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ట్రాఫిక్ క్లియిరెన్స్ చర్యలు తీసుకున్నారు. కారులో ఉన్న వారికి స్వల్పగాయాలు అయ్యాయి.

వరికి తెగులు.. రైతుకు దిగులు

- వర్షాభావంతో అరకొరగా సాగు
- సుడిదోమతో తీవ్రనష్టం
- సస్యరక్షణ చర్యలతోనే నివారణ



సుడిదోమ పీల్చడంతో ఎండిన వరి పంట మొదళ్లు

రాయచోటి : వ్యవసాయమే జీవనాధారంగా పోరాటం చేస్తున్న రైతులపై ప్రకృతి పగబట్టింది. రాష్ట్రంలో ఒక వైపు వరదలతో అల్లాడుతుంటే.. రాయలసీమ జిల్లాల్లో ఒకటైన అన్నమయ్య జిల్లాలో తీవ్ర వర్షాభావంతో అరకొరగా సాగైన పంటలకు నీటి కొరత ఒక వైపు.. సాగైన పంటలకు తెగుళ్ల దాడులు ఇంకో వైపు వెంటాడుతున్నాయి.

ఇప్పటికే అడుగంటిన భూగర్భ జలాలతో అంతంత మాత్రంగా సాగైన వరి పంటకు సుడిదోమ తెగులు పట్టి పీడిస్తోంది. సాగైన పంట పొట్టకు వచ్చి కంకిగా మారే సమయంలో తెగుళ్ల రూపంలో చుట్టుముట్టాయి. జిల్లాలో 10 వేల హెక్టార్లకు పైగా వరి సాగు కావాల్సి ఉంది. సాధారణ సాగులో 20 శాతానికి మించి వరి పంటను సాగు చేయలేదు. సాగు చేసిన పంటకు తెగుళ్ల రూపంలో రైతులను వెంటాడుతున్నాయి. సాగు చేసిన పంటకు తగినంత నీటిని అందివ్వలేక కొంత మంది రైతులు ఆశలు వదులుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆశిస్తున్న తెగుళ్లు రైతులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. అనావృష్టి కారణంగా ఉక్కపోతగా మారడంతో సుడిదోమ ఉధృతి ఎక్కువైంది. పంట బాగా పెరిగి కరుకు దశకు చేరుకుని.. కంకి ఇడుస్తున్న సమయంలో ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు రైతులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. పిల్ల, పెద్ద దోమలు నీటిపై భాగంలో తేలియాడుతూ దుబ్బుల మొదళ్ల దగ్గర రసం పీల్చడంతో ఆకులు పసుపు రంగులోకి మారుతున్నాయి. నివారణ చర్యలు చేపట్టకపోతే పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. సన్న రకాల్లో త్వరగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు.

తెగులు సోకే విధానం

వరి పొలాల్లో సుడి దోమలు ఉంటాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాల తర్వాత వాతావరణం ఉక్కపోతగా మారడంతో దోమ తన ఉధృతిని పెంచుకుంది. ఎక్కువ సంఖ్యలో దోమలు పంట మొదళ్ల చుట్టూ కనిపిస్తాయి.

■ పొలాల్లో నీటిపై భాగంలో తేలుతూ మొదళ్ల చుట్టూ తిరుగుతూ రసాన్ని పీల్చడంతో ఆకులు పసుపు రంగులోకి మారుతాయి. ఉధృతి ఎక్కువగా ఉంటే నీటిపై నూనె తెట్టులాగా కనిపిస్తుంది. మొక్క సుడులుగా ఎండిపోతుంది. దీనిని హాప్ బర్న్‌గా పిలుస్తారు.

పంట నష్టం

పొట్ట దశలో ఉధృతి ఎక్కువైతే పంటకు గింజ రాదు. గింజ దశలో వస్తే నాణ్యత దెబ్బతింటుంది. నూక శాతం పెరిగి దిగుబడి పడిపోతుంది. ఒక్కోసారి పంట చేతికి రాకపోవచ్చు.

సస్యరక్షణ ఇలా..

పొలాల్లో 5 నుంచి 10 దోమలు కనిపిస్తే తూర్పు, పడమర దిశగా రెండు మీటర్ల దూరంగా పాయలు ఏర్పాటు చేయాలి. దీంతో పంటకు గాలి, వెలుతురు సోకి దోమ ఉధృతి తగ్గుతుంది. పొలంలో నీటిని పెడుతూ తీసివేస్తే గుడ్లు, పిల్ల పురుగుల ఉధృతి తగ్గుతుంది.

పిచికారీ

దోమ కనిపించిన మొదటి దశలో వేపనూనె 1500 పీపీఎంను 5 మిల్లీలీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. తర్వాత దశలో ట్రిఫ్లుమిజో పైరిమ్ మందును 94 మి.లీ వంతున ఎకరానికి పిచికారీ చేయాలి. పొట్ట దశలో యూరియాతోపాటు పొటాష్ కలిపి వేసుకుంటే మొక్క రోగనిరోధకశక్తి పెరుగుతుందని రాయచోటి మండల వ్యవసాయాధికారి దివాకర్ తెలిపారు.